## క్లుప్తంగా

### మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



బండి సంజీవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

**పెద్దపల్లిరూరల్:** ప్రభుత్వం మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ డిమాండ్‌చేశారు. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ మున్నూరుకాపు సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పెద్దపల్లి మండలం రాగినేడుకు చెందిన చింతపండు మహేందర్, యువత అధ్యక్షుడిగా బండి సంజీవ్ ఎన్నికయ్యారు. మున్నూరుకాపుల్లో బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారని ప్రభుత్వాన్ని ఒప్పించి కార్పొరేషన్ ఏర్పాటయ్యేలా చూడాలన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

**మంథని/కమాన్‌పూర్:** నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాటారం, మహాదేవపూర్ మండలానికి చెందిన 42 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అందించారు. సోమవారం పలువురికి చెక్కులను అందించారు. కమాన్‌పూర్ మండలకేంద్రానికి చెందిన గుంపుల స్వామికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.14వేల చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు ఇనగంటి రామారావు, పీట్ల గోపాల్, అనిల్, సంపత్, స్వామి, లక్ష్మణ్, రవి, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### 'మా చెక్కులు మాకివ్వండి'

**మంథని:** సారూ మా చెక్కులు మాకివ్వండి అంటూ మంథనికి చెందిన మాజీ మహిళా ప్రజాప్రతినిధి పుప్పాల భాగ్యలక్ష్మీ ఓ పార్టీ సీనియర్ నాయకుడిని వేడుకుంటూ సోమవారం సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. గత మున్సిపల్ ఎన్నికల్లో 2వార్డు కౌన్సిలర్‌గా పోటీచేసి ఓటమిపాలయ్యానని ఆ సమయంలో తన వద్ద నుంచి ఖాళీ చెక్కులు, బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకున్నారని ఆ చెక్కులు తిరిగి ఇవ్వకుండా మూడేళ్లుగా తిప్పుకుంటున్నారని ఆవేదన చెందారు. ఆర్థికంగా చితికిపోయి కాలం వెల్లదీస్తున్నామని వేడుకుంటున్నారు.

### వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపండి

**జూలపల్లి:** మండలంలోని వడ్కాపూర్ నుంచి ధూళికట్ట హుస్సేనిమియా వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపాలంటూ కాంగ్రెస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్‌ను అడ్డుకున్నారు. మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని నిర్వహించేందుకు ఆయన గ్రామానికి వస్తుండగా.. కాంగ్రెస్ నాయకులు కొంద్ర సంతోష్,కొరెపు సంపత్, వేల్పులలింగయ్య, గుమ్మడి లక్ష్మణ్ ఆయనతో మాట్లాడారు. సమస్యను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని, నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు.

### తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సోమేష్

**యైటింక్లయిన్‌కాలనీ:** రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరులో సోమవారం రామగుండం మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ అడప సోమేశ్ తడిపొడి చెత్త సేకరణపై ఇంటింకి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటితో పాటు ఇంటి ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. తడి, పోడి చెత్తను వేరువేరు డబ్బాల్లో ఉంచి మున్సిపల్ చెత్త ట్రాలీలో వేయాలని డివిజన్ వాసులకు సూచించారు. చెత్త ఆరుబయట వేస్తే రూ.10వేలు జరిమానా విధిస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బంది శంకర్, లింగయ్య, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.


### మృతుల పేర్లను తొలగించాలి

**ఓదెల:** గ్రామాల్లో మృతిచెందిన ఓటర్లను గుర్తించి వారిని ఓటరు జాబితా నుంచి తొలగించాలని ట్రైనర్స్ శ్రీనివాస్, సుదర్శన్, రాజేందర్, శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఓదెల ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటుహక్కు కల్పించాలన్నారు. సవరణలు తొలగింపులు చేయాలన్నారు. తహసీల్దార్ ఖత్రోజు రమేశ్, ఆర్‌ఐలు బండ రాజేందర్, నర్సింగ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# బల్దియాలో ఆగని ఫేక్ కాల్స్

- బల్దియాలో ఆగని ఫేక్ కాల్స్!
- సోమవారం పలువురికి ఫోన్‌చేసి బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదుచేసిన అధికారులు

**కోల్‌సిటీ:** 'హలో.. నేను రామగుండం మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నా..' అంటూ ఫేక్ కాల్స్ చేసి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న అపరిచితుడి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. సోమవారం గోదావరిఖనిలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేశాడు. ట్రేడ్ లైసెన్స్‌లు ఎందుకు రెన్యూవల్ చేసుకోలేదని భారీగా పెనాల్టీలు వేస్తామని హెచ్చరించాడు. కాగా, ఫేక్ కాల్స్ చేస్తున్న మోసగాడి బాగోతాన్ని ఫోన్ నంబర్లతో సహా 'ట్రేడ్ లైసెన్స్ పేరుతో టోకరా' అనే శీర్షికను సోమవారం 'సాక్షి' ప్రచురించడంతో, నగరంలోని వ్యాపారులు అప్రమత్తం అయ్యారు. మాతంగి కాంప్లెక్స్‌లోని అప్నాబజార్ సూపర్ మార్కెట్ యజమాని దూడపాలక మల్లేశ్‌కు కూడా ఆ అపరిచితుడు ఫోన్‌చేశాడు. అప్పటికే సాక్షిలో వచ్చిన




కథనాన్ని చదివిన వ్యాపారి వెంటనే, ఫేక్ కాల్ అని గ్రహించాడు. అపరిచితుడిని మాటల్లో దింపి వాయిస్ రికార్డుచేశాడు. మీరు ఎక్కడి కమిషనర్ సార్.. అని ప్రశ్నించడంతో వెంటనే ఫోన్ కట్‌చేశాడు. ఇదే తరహాలో సుమారు 20 మందికిపైగా వ్యాపారులకు ఫేక్‌కాల్స్ చేసినట్లు ప్రచారం. 9110763848 నంబర్‌తో ఫేక్‌కాల్స్ చేస్తున్న అపరిచితుడు, ఆదివారం వరకు మున్సిపల్ కమిషనర్ అసిస్టెంట్ ఖమ్మం, ఉమేశ్ సూపర్‌వైజర్ అని ట్రూకాలర్ చూపించగా, సోమవారం మున్సిపల్ కమిషనర్ అసిస్టెంట్ రామగుండం అని ట్రూకాలర్‌లో మార్చుకొని ఉండగా, మరో వాట్సాప్ నంబర్ 8309285419పై నరసరావుపేట్ మున్సిపల్ కమిషనర్, జయకుమార్‌రెడ్డి అని చూపించింది.

**పోలీసులకు అధికారుల ఫిర్యాదు...**

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్‌చేస్తూ, డబ్బులు వసూలు చేస్తున్న అపరిచితుడిపై సోమవారం రామగుండం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రంగు నాగభూషణం, జన్ను సునీల్‌కుమార్, మంతెన శ్యాంసుందర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అపరిచితుడు వాడుతున్న ఫోన్ నంబర్, వాట్సాప్, ఫోన్‌పే నంబర్ల వివరాలతోపాటు ఫోన్‌కాల్ రికార్డులను ఫిర్యాదుతో సమర్పించారు. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



గర్రెపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

**గోదావరిఖని/రామగుండం/కోల్‌సిటీ/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్/ధర్మారం/కమాన్‌పూర్/ఎలిగేడు/జూలపల్లి/మంథని:** రామగుండం, మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల వ్యాప్తంగా సోమవారం ఐటీశాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సుల్తానాబాద్‌రూరల్ మండలంలోని గర్రెపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు తినిపించారు. గొల్లపల్లిలో సర్పంచ్ బండారి రమేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పింఛన్ రూ.4016కు పెంచినందుకు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గ్రామానికి చెందిన ఒంటరి మహిళ గాదం రాజమ్మ అనే వృద్ధురాలికి కేటీఆర్ జన్మదినం సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గిఫ్ట్ ఏ స్మైల్ పథకంలో ఇంటిని బహుమతిగా అందించి ప్రారంభించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. గోదావరిఖనిలోని ప్రభుత్వాస్పత్రిలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరంలో 22 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, రక్తదాతలను ఎమ్మెల్యే, మేయర్ అభినందించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లకు ఎమ్మెల్యే, మేయర్ పండ్లు పంపిణీ చేశారు. జూలపల్లి ప్రభుత్వ బాలుర పాఠశాలలో గిఫ్ట్ ఏ స్మైల్ పథకంలో భాగంగా కేసీఆర్ సేవాదళం సభ్యులు విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ నాయకులతో కలసి కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. గోదావరిఖనిలోని వీరాంజనేయ హమాలీ సంఘం కార్యాలయంలో అసమ్మతి నేతలు పాతిపెల్లి ఎల్లయ్య, మిర్యాల రాజిరెడ్డి, కొంకటి లక్ష్మినారాయణ, కందుల సంధ్యారాణి, బయ్యపు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ బర్త్‌డే కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. మంథనిలో బీఆర్‌ఎస్ శ్రేణులు జెడ్పీ చైర్మన్ పుట్టమధు నివాసంలో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు.



రామగుండం: కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే చందర్



గిఫ్ట్ ఏ స్మైల్ కింద బహుమతిగా ఇచ్చిన ఇల్లు



గోదావరిఖనిలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

## ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

**శాంతింపజేసిన పోలీసులు**

**కాల్వశ్రీరాంపూర్:** ఇసుక లారీలను రాత్రిపూట నడిపించొద్దంటూ గ్రామస్తులు ఇసుక లారీలను అడ్డుకున్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లిలో సోమవారం ఈఘటన చోటుచేసుకుంది. లారీలు రోడ్డు దిగడం లేదని దీంతో బైక్‌లు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారని పశువులు ప్రమాదాలకు గుర్రైప్రాణాలు కోల్పోతున్నాయని, పలుమార్లు వాహనదారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రిలో చేరారారని గ్రామస్తులు వాపోయారు. సోమవారం బైక్‌పై దంపతులు వెళ్తుండగా ఇసుకలారీ డ్రైవర్ సైడ్ ఇవ్వకపోవడంతో ప్రమాదానికి గురై తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని గ్రామస్తులు వాపోయారు. ఈక్రమంలో ఆగ్రహానికి గురైఆందోళనకు దిగారు. లారీలను అడ్డుకున్నారన్న సమాచారంతో కాల్వశ్రీరాంపూర్ పోలీసులు గ్రామానికి చేరుకుని గ్రామస్తులను సముదాయించి శాంతింపజేశారు.



ఇసుకలారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

### మంథని ఆర్టీసీ డీఎంగా రాజశేఖరం

**మంథని:** మంథని ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రాజశేఖరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎం శ్రీనివాస్ ఆర్మూర్‌కు బదిలీపై వెళ్లారు. హైదరాబాద్ బస్ భవన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్న రాజశేఖరంను పదోన్నతిపై ఇక్కడకు పంపించారు.

### సైకో దాడిలో గాయాలు

**గోదావరిఖని:** సైకో దాడిలో పలువురికి గాయాలయ్యాయి. సోమవారం స్థానిక స్వతంత్రచౌక్‌లో కొద్దిసేపు బీభత్సం సృష్టించాడు. దారి వెంట వెళ్లేవారిపై రాళ్లతో దాడి చేశారు. దీంతో పలువురు గాయపడ్డారు. కొంతమంది యువకులు సాహసం చేసి అతన్ని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. సైకోకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. సైకో బాషను బట్టి నేపాల్‌కు చెందినవాడని భావిస్తున్నామని, సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ సమ్మయ్య తెలిపారు.

### దాడిలో యువకుడికి గాయాలు

**గోదావరిఖని:** స్థానిక ఇందిరానగర్‌లో జరిగిన దాడిలో చల్లా ధను గాయపడినట్లు వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. పాతపగలు దృష్టిలో పెట్టుకుని అదే ప్రాంతానికి చెందిన దున్నపోతుల శ్రావణ్, శివ, రమేశ్, సాయికుమార్, శిరీష దాడి చేయడంతో ధను గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

## అబ్బాపూర్‌లో పోచమ్మ ఆలయం వద్ద హోమం

**జూలపల్లి:** మండలంలోని అబ్బాపూర్ పోచమ్మ తల్లి ఆలయం ఆవరణలో సోమవారం అర్చకులు హోమం నిర్వహించారు. గత నెలలో ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పోచమ్మ తల్లిని విగ్రహాన్ని పునప్రతిష్ఠించగా, 41వ రోజు హోమం నిర్వహించాలని అర్చకుల సూచనతో గ్రామస్తుల సమక్షంలో హోమం కాల్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దంపతులు, ఈర్ల మల్లేశం, ఎంపీటీసీ సభ్యుడు దండె వెంకటేశం దంపతులు, ఉపసర్పంచ్ రాజవ్వ, కుల సంఘాలపెద్దలు పసునూటి శ్రీనివాస్, గాండ్ల చంద్రయ్య, బొంగాని రాజేశం, గన్ను నర్సింహారెడ్డి, నల్లాల కనకరాజు, కత్తెర్ల రాజేశం, మహిళలు హోమంలో పాల్గొని మొక్కులు చెల్లించారు.



జూలపల్లి: అబ్బాపూర్‌లో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

**శివాలయంలో పంచామృతాలతో పూజ**

**సుల్తానాబాద్:** మండలకేంద్రంలోని శివాలయం, సాంబశివాలయాల్లో శివలింగానికి పంచామృతాలతో ప్రత్యేక పూజలను సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచులు అంతటి పుష్పలత, అన్నయ్యగౌడ్ నిర్వహించారు. సోమవారం అధిక శ్రావణ సోమవారం సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, శివాలయం భక్త బృందం అల్లంకి ఆనందం, కాసం భూమన్న పద్మావతి, అడిచెర్ల శ్రీనివాస్, కొమురవెల్లి సురేశ్, కొమరవెల్లి అంజయ్య, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

### పీరీల మసీద్ వద్ద అన్నదానం

**కమాన్‌పూర్:** మండలకేంద్రంలోని అంగడి బజారు వద్ద నెలకొల్పిన పీరీల మసీద్ వద్ద సోమవానం మసీద్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పలిగిరి సత్తయ్య, ఫహీం, నారగోని సరిత, కొత్తగాండ్ల సదయ్య, బుర్ర సాయి, నీలం మధుకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి




మాట్లాడుతున్న కోడిపుంజుల జ్యోతి

**జ్యోతినగర్/రామగుండం:** మణిపూర్‌లో మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ నాయకురాలు కోడిపుంజుల జ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో నిరసన చేపట్టి మాట్లాడారు. మణిపూర్ ప్రభుత్వానికి, కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. మణిపూర్‌లో మహిళలను అవమానపర్చిన నిందితులను గుర్తించి అక్కడి ప్రభుత్వం వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినటువ్యవహరించకుండా ఘటనలపై విచారణ జరిపించి, శాంతిభద్రతలను చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అంతర్గాం జంక్షన్‌లో కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి చిలుక శంకర్, లలిత, భూలక్ష్మీ, పద్మ, రాయమల్లమ్మ, సరోజన, పద్మ, కవిత, ప్రతినిధులు కొల్లూరి మల్లేశ్ మేర్గు చంద్రయ్య, తమ్మనవేణి రాజకొమురయ్య, నసీరొద్దీన్, మురుకుంట్ల శ్రీనివాస్, ఆలకుంట దేవయ్య, తోకల శంకరయ్య, రాములు, కృపాకర్, రాంచంద్రం, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



ధర్మారంలో క్షీరాభిషేకం చేస్తున్న ముస్లింలు

**ధర్మారం:** సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి పూర్తిస్థాయి సబ్సిడీతో రూ.లక్ష సాయం అందిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ ధర్మారం మండలకేంద్రంలో మైనార్టీ సెల్ నాయకుడు ఎండీ. హఫీజ్ ఆధ్వర్యంలో సోమవారం సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండలఅధ్యక్షుడు రాసూరి శ్రీధర్, ప్రధానకార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, మార్కెట్‌కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. సలామొద్దీన్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కనకలక్ష్మి, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు మల్లేశ్‌నాయక్ ముస్లిం నాయకులు ఎండీ బాబా, ఎండీ. అజాంబాబా, పాల్గొన్నారు.

**వీఆర్‌ఏల సంబరాలు**

**ఓదెల:** సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ పదోన్నతి కల్పిస్తూ జీవో విడుదల చేసినందుకు ఓదెల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏల సంఘం ప్రతినిధి పోతుల స్వామి, తుంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసీఆర్‌చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కొంతకాలంగా ఎదురుచూస్తున్న వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్‌ఏలు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు తొకల రవి, అన్వర్, రాజు, మనీ, రాపల్లి శ్రీనివాస్, భాస్కర్, సురేందర్ పాల్గొన్నారు.

### నందిని విన్నర్ మీట్ వేడుకలు

**గోదావరిఖనిటౌన్:** స్థానిక విఠల్‌నగర్ నివాసి మహేశ్ గొట్టె రూపొందించిన నందిని లవ్‌స్టోరీ లఘుచిత్రానికి జిల్లాస్థాయి పోటీల్లో మొదటి బహుమతి సాధించడంతో స్థానిక రాజేష్‌థియేటర్‌లో చిత్రం హీరో సంజిత్‌రాజ్ ఆధ్వర్యంలో సోమవారం కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. మహేశ్ మాట్లాడుతూ.. ఆదివారం మాతంగికాలనీలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో సీఇండియా రైజింగ్(సర్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బహుమతుల ప్రదానోత్సవంలో తాను చిత్రీకరించిన నందిని లఘుచిత్రానికి మొదటిబహుతి రావడం ఆనందంగా ఉందన్నారు. కళాకారులను ప్రోత్సహించే దిశగా సర్ ఫౌండేషన్ చైర్మన్ తమ్మెర మన్మోహన్ కృషి అభినందనీయమని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గత ఫిబ్రవరిలో కరీంనగర్‌లో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ 3వ బహుమతి అందించారన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల అధ్యక్షుడు దయానంద్ గాంధీ, కళాకారులు రహీం, మూల శంకర్, సోగాల వెంకటి, ఆమేజింగ్ స్టార్ వేముల అశోక్, లోకల్ మెగాస్టార్ దామెర రాజేశ్, అంజిబాబు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటికాలిపై జీపీ కార్మికుల నిరసన



మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



నిరసన తెలుపుతున్న జీపీ ఉద్యోగ, కార్మికులు

**ఎలిగేడు/ఓదెల/కాల్వశ్రీరాంపూర్/మంథని:** ఎలిగేడు మండలకేంద్రంలో జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం 19 వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసనను తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని బీజే పీ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ సందర్శించి మద్దతు తెలిపారు. కార్మికులతో కలిసి సహపంక్తి భోజనంచేశారు. ఓదెలలో జీపీ కార్మికుల సమ్మెలో కార్మికులు నాగయ్య, రంజిత్, కుమార్, నరేశ్, బ్రహ్మచారి ప్రభాకర్ పాల్గొన్నారు. కాల్వశ్రీరాంపూర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జీపీ కార్మికులు చేపట్టిన దీక్షకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మంద రాజేందర్ పాల్గొని మద్దతు తెలిపారు. మంథని ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మెచేస్తున్న కార్మికులకు సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు మద్దతు తెలిపారు. ఈనెల 27న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిలో జిల్లాలోని జీపీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రమాద బీమా శిబిరం

**గోదావరిఖనిటౌన్:** స్థానిక అశోక్‌నగర్ చౌరస్తాలో రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోస్టాఫీసు ప్రమాద బీమా శిబిరాన్ని నిర్వహించారు. రూ.396 బజాజ్ ఇన్సూరెన్స్ పాలసీ, రూ.399 టాటా ఇన్సూరెన్స్ పాలసీతో రూ.20 లక్షల ప్రమాద బీమా ఉంటుందని, పాలసీ ప్రయోజనాలను వివరించి పలువురికి బీమా చేయించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ వేణుగోపాల్, మేయిల్ ఓవర్సీస్ పోషం, పోస్టు మ్యాన్‌లు మేకల రాజేశ్, కుర్షీద్, లక్ష్మయ్య, సంపత్, సుబ్బారావు, శంకర్, స్వర్ణకారులు పాల్గొన్నారు.



బీమా వివరాలు తెలుపుతున్న పోస్టుమాస్టర్

### శ్రీచిలుకల రామేశ్వర ఆలయంలో పూజలు

**రామగుండం:** అధిక శ్రావణమాసం పురస్కరించుకుని సోమవారం అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామంలో స్వయంభూ వెలిసిన శ్రీచిలుకల రామేశ్వరాలయంలో మార్వాడీ సేవా సమాజ్ ప్రతినిధులు పూజలుచేశారు. ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అఖండ మహా హారతి, తీర్థప్రసాద వితరణ అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధులు వారికి సహకరించారు.



పూజలందుకుంటున్న శివుడు

## ప్రయాణికులు లేక బోసిపోయిన రైల్వేస్టేషన్



**ఓదెల:** భారీ వర్షాలకు ప్రయాణికులు లేక రైల్వేస్టేషన్లు బోసిపోతున్నాయి. సికింద్రాబాద్, ఖాజీపేట నుంచి బల్లార్షా, సిర్‌పూర్‌కాగజ్‌నగర్ మధ్య నడిచే రైళ్లన్నీ వారం రోజులుగా ఖాళీగా వెళ్తున్నాయి. భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, అజ్నీ ప్యాసింజర్, సిర్‌పూర్‌కాగజ్‌నగర్ రైళ్లలో పదుల సంఖ్యలోనే ప్రయాణికులు వెళ్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో రైల్వేశాఖకు ఆదాయం తగ్గిందని అంచనా వేస్తున్నారు.

## 'భౌ'బోయ్.. కుక్కలు





పెద్దపల్లిలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. పాదచారులు, వాహనదారుల వెంటపడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏ కాలనీలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు నష్టంవాటిల్లకముందే కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు ప్రజలు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి